క్లుప్తంగా

అర్హులందరికీ వ్యవసాయ కనెక్షన్లు



విద్యుత్ కనెక్షన్లు ప్రారంభిస్తున్న ఈఈ

బల్లికురవ: అర్హులందరికీ ప్రాధాన్యత క్రమంలో వ్యవసాయానికి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాను ఇస్తున్నట్లు ఆ శాఖ ఈఈ ఎస్ మస్తాన్ రావు తెలిపారు. సోమవారం నక్కబొక్కలపాడు గ్రామంలో 30 వ్యవసాయ బోర్లకు ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుతో ప్రారంభించారు. దరఖాస్తు చేసుకోగానే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక లైన్లు, ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుతో ఒక్కో ట్రాన్స్ ఫార్మర్ నుంచి ముగ్గురి నుంచి ఐదుగురు రైతుల వరకు కనెక్షన్లు ఇస్తున్నామని ఈఈ వివరించారు. కార్యక్రమంలో డీఈ సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, సర్పంచ్ రామయ్య, స్థానిక నేత హనుమంతరావు, పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌తో సమస్యల పరిష్కారం

చీరాల టౌన్: సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక చక్కటి వేదిక అని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. పలుశాఖల అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఆర్డీవోకు అందించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలకు ఉన్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సమస్యలను అర్జీల ద్వారా అందిస్తే సత్వరమే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ రకాల రెవెన్యూ, భూ సమస్యలపై ప్రజలు 18 అర్జీలను అందించారు. కార్యక్రమంలో డీఏవో జి.మునలయ్య, పలుశాఖల అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

చీరాల: పట్టణంలోని వైపే ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలోని మహిళా సాధికారత సెల్, చీరాల రోటరీ క్లబ్ సహకారంతో సోమవారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఐ.బాబూరావు సారధ్యంలో జీవీఆర్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ అస్మా పాల్గొని మాట్లాడారు. మూడు నెలలకు ఒకసారి పరీక్ష చేయించుకోవాలని, ఒకటి, రెండు స్టేజిలలో ఉంటే కీమోథెరపీ, రేడియోథెరపీ ద్వారా సర్జరీ చేసి రోగిని బతికించే అవకాశం ఉందన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకుంటూ బయట ఆహారం తినకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు వలివేటి మురళీకృష్ణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.రత్నప్రభ, అంకమ్మ, భానుకుమారి, సుభాషిణి, లలితకుమారి, జివై ప్రసాద్, జి.రమేష్, స్వామి, శివాంజనేయ ప్రసాద్, కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.



అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



చీరాల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కల్తీ మద్యం పాపం
కూటమి ప్రభుత్వానిదే

- కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలి
- పాఠశాలల కన్నా ఎక్కువగా ప్రతి వీధిలో బెల్టుషాపులు
- సీబీఐ చేత దర్యాప్తు చేయించాలి..
- నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్ కుమార్
- భారీ వర్షంలో పర్చూరులో నిరసన ర్యాలీ నిర్వహించిన నాయకులు
- ఎక్సైజ్ సీఐ భుజంగరావుకు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం
- నకిలీ మద్యం బయటపడినా వైఎస్సార్ సీపీపైనే అక్కసు
- జోరువానలోనూ పోరుబాటలో వైఎస్సార్ సీపీ నేతలు
- చీరాలలో భారీగా పాల్గొన్న పార్టీ శ్రేణులు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్ కుమార్



ఎక్సైజ్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న అశోక్ కుమార్



పర్చూరులో ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

అద్దంకి: రాష్ట్రంలో కల్తీ మద్యం ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని.. కూటమి ప్రభుత్వం కళ్లు తెరచి కల్తీ మద్యంతో పోతున్న ప్రజల ప్రాణాలను కాపాడాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి, ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం ముందు నిరసన నిర్వహించారు. తరువాత అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాష్ట్రం మత్తులో చిత్తవుతోందన్నారు. ప్రజల ప్రాణాలు పణంగా పెట్టి కల్తీ మద్యం తయారు చేసి కాసుల వెనుకేసుకుంటున్నారని చెప్పారు. ప్రతి ఊరిలో వైన్ షాప్ దక్కించుకున్న వారిని కూటమి నాయకులు బెదిరించి షాపును తమ సొంతం చేసుకుని నడపడం లేదా అన్నారు. ఆ నష్టాలను భర్తీ చేసుకోవడం కోసం తప్పుడు మార్గాల్లో పయనిస్తున్నారని చెప్పారు.

సిట్ ఏర్పాటుతో నీరుగార్చే కుట్ర..

కల్తీ మద్యం కుంభకోణాన్ని నీరుగార్చేందుకే సిట్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పడం హాస్యాస్పదం అని అన్నారు. సిట్ అంటే మీరు సిట్, స్టాండ్ అంటే స్టాండ్. చిత్త శుద్ధి ఉంటే కేసును సీబీఐకి అప్పగించి విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వాటిని బయటకు తీసుకొస్తున్న జర్నలిస్టులపై కేసులు పెట్టడం దుర్మార్గం. ప్రతి ఊరిలో బడి ఉందో లేదో తెలియదు కాని బెల్టు షాపు మాత్రం ఉందని ఎద్దేవా చేశారు. కల్తీ మద్యం కేసులో ప్రధాన పాత్రధారిని పట్టుకోకుండా పట్టుకున్న అధికారులను సస్పెండ్ చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. మా పార్టీ నుంచి వచ్చిన వాళ్లు ఎంతో మంది మీ పార్టీలో ఉన్నారు. వాళ్లందరూ మా కోవర్టులేనా? ఆ మాట కొస్తే అద్దంకిలో గెలుపొందిన గొట్టిపాటి రవికుమార్ కూడా మా కోవర్టేనా? నిజంగా కోవర్టులనుకుంటే వాళ్లందరినీ సస్పెండ్ చేయండిని ప్రశ్నించారు. అక్రమాలు వెలికితీసిన మీడియాపై కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. నాలుగో స్తంభాన్ని కూలుస్తారా? ఆరోగ్యం బాగోలేకుంటే ఆస్తులు అమ్ముకోనైనా బాగు చేసుకోవచ్చు. కుటీర పరిశ్రమలాగా కల్తీ మద్యం పరిశ్రమను చేపట్టారు. వాటిని తక్షణమే నిషేధించాలని కోరుతూ గ్రామ గ్రామాన ఉద్యమంలా మహిళలు ముందుకు వచ్చి మద్యం మహమ్మారిని తరిమికొట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం జనరల్ సెక్రటరీ కుంచాల శ్రీవిద్య, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గునుపూడి రఘురామ గుప్తా, పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, బల్లికురవ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, సంతమాగులూరు మండల కన్వీనర్ వూట్ల నాగేశ్వరరావు, జే పంగులూరు మండల కన్వీనర్, రావూరి శ్రీనివాసరావు, కొరిశపాడు మండల కన్వీనర్ శ్రీధర్, మహిళా నాయకులు కాశి కుమారి, కొల్లా భువనేశ్వరి, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై సీబీఐ విచారణ జరిపించాలి

పర్చూరు(చినగంజాం): రాష్ట్రంలో జరుగుతున్న నకిలీ మద్యం తయారీ, అమ్మకాలపై సీబీఐ విచారణ జరిపించి నకిలీ మద్యం తాగడంతో ప్రాణాలు కోల్పోతున్న అమాయకులను కాపాడాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని, నకిలీ మద్యం దందాపై సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పర్చూరు పార్టీ కార్యాలయం నుంచి బ్యానర్ పట్టుకొని ప్లకార్డులు ధరించి ఎక్సైజ్ శాఖ కార్యాలయం వరకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ర్యాలీగా వెళ్లి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. నకిలీ మద్యాన్ని అరికట్టాలని, నకిలీ మద్యం తయారీదారులపై చర్యలు తీసుకోవాలని, తయారీ అమ్మకాలపై సీబీఐ విచారణ జరపాలని నినాదాలు చేస్తూ కార్యాలయం ఎదుట తమ నిరసనను తెలిపారు. అనంతరం ఎక్సైజ్ సీఐ భుజంగరావుకు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

గుడి, బడి తేడా లేకుండా బెల్టుషాపులు..

ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో తయారవుతున్న మద్యం అధికార ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు, వారి తాబేదారులు, పెట్టుబడిదారులు ఆధ్వర్యంలోనే జరుగుతుందని కల్తీ మద్యాన్ని తయారు చేసి రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది చావులకు కారణమవుతున్న తరుణంలో వైఎస్సార్ సీపీ నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం మద్యం షాపులలో అక్రమంగా మద్యం అమ్మకం చేసిందంటూ అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ తొత్తులతో నకిలీ మద్యం తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి అక్రమ మద్యం అమ్మకాలు సాగిస్తూ అక్రమ సంపాదన గడిస్తున్నారన్నారు. నకిలీ మద్యం అమ్మకాలతో అక్రమంగా దనార్జన చేస్తూ దండుకోవడం, దాచుకోవటంతో రాష్ట్రాన్ని నాశనం చేశారని అక్రమ మద్యంపై సీబీఐ విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌లు జంపని వీరయ్య చౌదరి, చిన్ని పూర్ణారావు, పఠాన్ కాలేషావలి, ముప్పాళ్ల రాఘవయ్య, కేవీ సుబ్బారావు చౌదరి, పాదర్తి ప్రకాష్, మైలా చిన నాగేశ్వరరావు, భవనం హరిరామరెడ్డి, అయేషా బుడే, షంషుద్దీన్, చంద్రరెడ్డి, మొలకా సుబ్బారెడ్డి, అజయ్‌రెడ్డి, సింహాద్రి బ్రహ్మారెడ్డి, దాసరి వెంకట్రావు, కుమ్మరి చందు, బాబురావు, ముప్పల రాంబాబు, ఎంవీ రామారావు, జంగా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమగా నకిలీ మద్యం తయారీ



చీరాల ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీరాల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుటీర పరిశ్రమగా నకిలీ మద్యం యథేచ్ఛగా తయారవుతోందని.. ఇందుకు పూర్తి బాధ్యతను ప్రభుత్వమే వహించాలని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. నకిలీ మద్యం తయారీని ఒక పరిశ్రమగా మార్చి దానిని రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్న టీడీపీ నాయకులు, కూటమి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సూచనల మేరకు సోమవారం నియోజకవర్గంలోని చీరాల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, కొత్తపేటలోని ఎక్సైజ్ పోలీస్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి కురుస్తున్న జోరువానను కూడా లెక్క చేయకుండా పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. ముందుగా కొత్తపేట నుంచి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు.

విచ్చలవిడిగా గంజాయి, కల్తీ మద్యం అమ్మకాలు..

ఈ సందర్భంగా పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో ఎన్నో అరాచక పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం పదవీ స్వీకారం రోజునే చీరాల ప్రాంతంలో గంజాయి ముఠా చేతిలో యువతి హత్య గురయిందన్నారు. గంజాయి అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా జరుగుతుందన్నారు. చీరాల రైల్వేస్టేషన్‌లోనే రెండు సార్లు కేజీలలో గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటనలు జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడిగా మద్యం షాపులకు అనుమతులు ఇచ్చి మద్యం ఏరులై పారించారన్నారు.

ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ల వాసు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, పట్టణ అధ్యక్షులు యాతం మేరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ యథేచ్ఛగా సాగుతుందన్నారు. నకిలీ మద్యానికి లేబుళ్లు వేసి వైన్‌షాపులు, బెల్ట్ షాపులకు తరలిస్తున్నారన్నారు. నకిలి మద్యం తాగి ఎంతో మంది మరణించారన్నారు. ఆ కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఏ సమాధానం చెప్తుందని ప్రశ్నించారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మంత్రి పదవి నుంచి తప్పించాలన్నారు. కూటమి పాలనపై ప్రభుత్వ ఉద్యోగులు అసంతృప్తిలో ఉన్నారన్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావుకు పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు కోడూరి ప్రసాద్‌రెడ్డి, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు కౌన్సిలర్ బత్తుల అనిల్, కౌన్సిలర్లు కంపా అరుణ్, చీమకుర్తి బాలకృష్ణ, చీరాల నియోజకవర్గ ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షులు తేళ్ల రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు అద్దంకిరెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, పట్టణ మహిళా నాయకురాలు ప్రసన్నదాసు, లీగల్ సెల్ అధ్యక్షులు రాజు వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ కబీర్, మాజీ కౌన్సిలర్ చెల్లి బాబూరావు, వేటపాలెం మండల అధ్యక్షులు సాధు రాఘవ, మాజీ అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, సాంబిరెడ్డి, రామన్నపేట ఉపసర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు రాజ్‌కుమార్, వినయ్, జంగా ప్రేమ్, రాజు, కిట్టు హనుమంత్‌రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

మేదరమెట్ల: డివిజనల్ స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనబరచిన కొరిశపాడు మండలంలోని పమిడిపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులను సోమవారం పాఠశాలలో అభినందించారు. ఇంకొల్లులో జరిగిన కబడీ పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో పీ.చరణ్‌తేజ, కే.కార్తీక్ అండర్-14 బాలుర విభాగంలో జీ.ధనుష్ అలాగే అండర్-17బాలికల విభాగంలో వీ.అమరేశ్వరి, అండర్-14 విభాగంలో సీహెచ్ మహాలక్ష్మీ,



పందిళ్లపల్లిలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

యూ.ప్రణతి అర్హత సాధించారు. పందిళ్లపల్లిలో జరిగిన అథ్లెటిక్స్ డివిజనల్ పోటీల్లో అండర్-14 బాలుర విభాగం 600 మీ పరుగు పందెంలో కే.యశ్వంత్, 400 మీటర్ల పరుగు పందెంలో వై.గిరి ఎంపికైనట్లు హెచ్‌ఎం అంజయ్య తెలిపారు. పోటీల్లో విశేష ప్రతిభను కనపరచిన విద్యార్థులను పీఈటీ సుల్తాన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు పందిళ్లపల్లి విద్యార్థులు

వేటపాలెం: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం తలమల దీప్తి సోమవారం తెలిపారు. ఇంకొల్లులో నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల పోటీల్లో అండర్-17 విభాగంలో హైజంప్‌లో సందీప్, హ్యామర్ త్రోలో హేమ నాగసాయి, వెంక టేశ్వర్లు, పూజిత, లాంగ్ జంప్‌లో ఆదిలక్ష్మి, వాలీబాల్ లో సందీప్, రవి తేజ, సిద్దు, కబడ్డీలో సందీప్, సిద్దు, బ్యాడ్మింటన్‌లో పూజిత, ఖోఖోలో డేని లక్ష్మణ్, అండర్-14 విభాగంలో 400 ,600 మీటర్లు రన్నింగ్‌లో ప్రియా నికిత, హైజంప్‌లో రత్నకుమార్, బ్యాడ్మింటన్‌లో కార్తి కేయ, జ్యోత్స్న, ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను స్టాఫ్ సెక్రటరీ బద్ది మోహన్‌రావు, ఎస్ అంకయ్య, పీఈటీలు కర్ల నాగేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు అభినందించారు.

వల్లాపల్లిలో కుక్కల స్వైర విహారం



గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

బల్లికురవ: మండలంలోని వల్లాపల్లి గ్రామంలో రెండు నెలలుగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో గుంపులు గుంపులుగా పగలు రాత్రి తేడా లేకుండా సంచరిస్తున్నాయి. కొత్త వ్యక్తులు గ్రామంలోకి రావాలంటేనే భయపడుతున్నారు. గతంలో అనేకమంది కుక్క కాటుకు గురై వైద్యానికి వేలకువేలు ఖర్చుచేశారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు కుక్కల తరలింపుకు చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

దుద్దుకూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రవాగు

ఇంకొల్లు(చినగంజాం): భారీ వర్షాల కారణంగా మండలంలోని దుద్దుకూరు వద్ద ఎర్రవాగు ఉధృతంగా పొంగి ప్రవహిస్తోంది. గ్రామంలోని ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా అధికారులు సోమవారం చర్యలు చేపట్టారు. తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్, ఎస్ఐ జీ సురేష్, రెవెన్యూ అధికారులు గ్రామంలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. గ్రామంలో ఎర్రవాగుపై నిర్మించిన చప్టా వద్ద ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. వరద నీరు చప్టాపైకి ప్రస్తుతం ఒక అడుగు పైగా ప్రవహిస్తుండటంతో చప్టాకు రెండు వైపులా ట్రాఫిక్ నిలిపి వేశారు. వాహనాలు రాకుండా రెండువైపులా ట్రాక్టర్‌లను అడ్డుగా నిలిపారు. వరద ఉధృతి పెరిగినప్పటికీ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.



పొంగి ప్రవహిస్తున్న ఎర్రవాగు

నీటితీరువా వసూళ్లు తప్పనిసరి

చీరాల టౌన్: గ్రామాల్లో ఉన్న పంట పొలాలకు సంబంధించిన నీటి తీరువా వసూళ్లను నెలాఖరు కల్లా పూర్తి చేయడంతో పాటుగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధిచి నీటి తీరువా రూ.40 లక్షలు వసూళ్ల లక్ష్యంగా గ్రామ రెవెన్యూ అధికారులు పనులు చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో డీటీ సూర్యనారాయణ, సర్వేయర్ , వీఆర్వోలు ఉన్నారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

జే.పంగులూరు: మండల పరిధిలోని 125 మంది విద్యార్థులకు అజిత్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున ట్రస్ట్ చైర్మన్ వీ వీరనారాయణ ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ పుస్తకాలు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదగా ఈ పుస్తకాలు రూపొందించారు. ఈ పుస్తకాలను వీరనారాయణ, యూటీఎఫ్ కౌన్సిలర్ సాయి సత్యనారాయణ మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చతువుతూ ఎన్ఎంఎంఎస్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు పంపిణీ చేశారు.

అక్టోబరు 18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

చినగంజాం: జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు 2025లో అక్టోబరు 18 నుంచి ప్రారంభమవుతాయని జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ నరసింహరావు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, హెచ్‌ఎం కే శ్రీనివాసరెడ్డి, చెకుముకి సైన్స్ సంబరాలు కరపత్రాన్ని చినగంజాం హైస్కూల్‌లో సోమవారం ఆవిష్కరించారు. చెకుముకి టాలెంట్ టెస్ట్ పాఠశాల స్థాయిలో అక్టోబరు 18న మండల స్థాయిలో, నవంబరు 1వ తేదీన జిల్లా స్థాయిలో నవంబరు 23వ తేదీన జిల్లాలో విజయం సాధించిన జట్టుకు రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12,13,14 తేదీలలో జరుపుతారని నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు ఉదయభానేశ్వరి, మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్ సుబ్బారావు, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో భర్తీకాని ఉపాధ్యాయ పోస్టులు

బల్లికురవ: మండలంలో పలు పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీకాలేదు. వివిధ పాఠశాలలో 22 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా 15 మందిని మాత్రమే కేటాయించారు. వివిధ పాఠశాలలో 8 వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు ఉండగా ఐదుగురిని మాత్రమే కేటాయించారు. కొమ్మినేనివారిపాలెం, కూకట్లపల్లి ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఉన్న ఈ డీఎస్సీలో కేటాయించలేదు. కొత్తగా ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసిన వల్లాపల్లి, ముక్తేశ్వరం, కొప్పరపాలెం వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయలేదు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు

చీరాల టౌన్: గ్రామ పంచాయితీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ఉంచాలని ఎంపీడీవో ఎస్.విజయ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయితీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ రామకృష్ణ, కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

రేపటి నుంచి మాలధారులకు ఉచిత సద్ది

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో 40 రోజులపాటు అయ్యప్ప, భవానీ, శివస్వాములు తదితర మాలధారులకు ఉచితంగా సద్ది ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పడమట బజారులో రుక్మాబాయి సమేత పాండురంగ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానంలో దాతల సహకారంతో అక్టోబరు 15వ తేదీ నుంచి నవంబరు 25వ తేదీ వరకు సద్ది ఏర్పాటు చేయనున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ సకల ఆంజనేయులు తెలిపారు.

పోలీసుల అదుపులో జూదరులు

చీరాల: పేకాట శిబిరంపై చీరాల ఒన్‌టౌన్ పోలీసులు సోమవారం మెరుపుదాడి చేశారు. చీరాల మండలం జాండ్రపేటలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సీఐ ఎస్.సుబ్బారావు, ఎస్సై రాజ్యలక్ష్మి, సిబ్బంది మెరుపుదాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.23 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎస్.సుబ్బారావు తెలిపారు.

అర్చకుడు చలపతాచార్యులు మృతి



యద్దనపూడి: మండలంలోని పోలూరు చెన్నకేశవస్వామి ఆలయ అర్చకుడు పరుచూరి చలపతాచార్యులు (84) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు యనమదల ఎండోమెంట్ గ్రూపు కార్యనిర్వాహణాధికారి దామా నాగేశ్వరావు సోమవారం తెలిపారు. 65 ఏళ్ల పాటు ఆలయంలో స్వామివారి పూజా, కైంకర్యాల్లో పాల్గొని స్వామివారి విశేష పూజలు నిర్వహించేవారు. వీరి తాత శేషాచార్యులు ఆలయ గాలి గోపుర నిర్మాణం చేపట్టం విశేషం. ఆయన మృతిచెందిన సంగతి తెలుసుకున్న అర్చకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.